TGTEL/26/A6780
# స్పందన
తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :28 | పేజీలు 8 | వెల : 5 | బుధవారం 14 అక్టోబర్ 2026

విలేకరులు కావలెను
జర్నలిస్టులే యాజమాన్యంగా నడపబడుతూ ప్రజా గొంతుకై అనతికాలంలోనే ప్రభంజనం సృష్టిస్తున్న స్పందన దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.ఆసక్తి ఉన్న వార
ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించండి
9440657806,9440697806



## ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం
# ఐక్యంగా పోరాడతాం

**ఓట్ల చోరులను న్యాయస్థానం ముందు నిలబెడతాం**

**ప్రతిపక్ష 'ఇండియా'కూటమి ప్రతిజ్ఞ**

**కూటమి నేతలకు రాహుల్ తేనీటి విందు**

**భవిష్యత్తు కార్యాచరణపై చర్చ : రాహుల్ గాంధీ**

దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఐక్యంగా పోరాడతామని, ఓట్ల చోరీకి బాధ్యులైన వారిని న్యాయస్థానం ముందు నిలబెడతామని ప్రతిపక్ష 'ఇండియా'కూటమి నాయకులు ప్రతిజ్ఞ చేశారు. నిరంకుశ పాలనపై రాజకీయ ప్రతిఘటన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో విపక్ష కూటమి నాయకులు, పౌర సమాజ సభ్యులకు తేనీటి విందు ఇచ్చారు. ఓట్ల చోరీకి, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టబోయే నిరసనకు సంబంధించిన వ్యూహంపై ఈ సందర్భంగా చర్చించారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: జంతర్‌మంతర్ నిరసనలను నిషేధించడంపైనా చర్చ జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఆర్జేడీ నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝా, జేఎంఎం నేత మహువా మాఝీ, సమాజ్ వాదీ పార్టీ నాయకులు హరేంద్ర మాలిక్, ఆనంద్ భదౌరియా, మొహిబుల్లా ఎన్సీపీ(ఎస్పీ) నాయకురాలు సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ చీఫ్ నేహా బోరా, సీపీఐ--ఎంఎల్ అగ్రనేత దీపాంకర్ భట్టాచార్య, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగరిక ఘోష్ , మహువా మొయిత్రాతోపాటు పౌర సమాజం సభ్యులు ప్రశాంత్ భూషణ్,

మిగతా 2 లో



## నీటి పొదుపుపై 60 రోజులపాటు చైతన్య కార్యక్రమాలు

**సీఎస్ సంజయ్ జాజు**

హైదరాబాద్, అక్టోబర్ 13: ఎల్‌నినో నేపథ్యంలో నీటి పొదుపుపై 60 రోజులపాటు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలలో తాగునీటి సరఫరా సన్నద్ధతపై సీఎస్ మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. "హైదరాబాద్ కోర్ ఏరియాకు ప్రధానంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరిల పరిధిలో ప్రస్తుతం 560 ఎంజీడీల

- మిగతా 2 లో..

## రాష్ట్ర రోడ్లకు కేంద్రం
# గ్రీన్‌సిగ్నల్

**ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం**

**హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై డీపీఆర్ తయారీకి ఆదేశం**

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి భేటీ**

**కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపనకు సమ్మతి.. 'ఇండియన్ రోడ్ కాంగ్రెస్'కు గడ్కరీకి ఆహ్వానం**



న్యూఢిల్లీ, అక్టోబర్ 13: తెలంగాణలో కీలక మౌలిక వసతుల కల్పన, జాతీయ రహదారుల విస్తరణ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ ఊతం లభించింది. రాష్ట్ర రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పలు పెండింగ్ ప్రాజెక్టులు,

మిగతా 2 లో

## డీఎస్సీ పిటిషన్లకు హైకోర్టు నో.. సర్కారు నిర్ణయానికే ఓకే..!

**జీవో 28పై మూడు రిట్‌లు కొట్టివేత..నియామకాలపై కీలక తీర్పు !**

హైదరాబాద్, అక్టోబర్ 13:డీఎస్సీ-2008 నియామకాలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. జీవో నంబర్ 28 సవరణను సవాల్ చేస్తూ బీఈడీ అభ్యర్థులు వేసిన మూడు రిట్ పిటిషన్లను కోర్టు కొట్టేసింది. 2008 డిసెంబర్ నోటిఫికేషన్ నిబంధనల ప్రకారమే ఎంపికలు చేపట్టాలన్న అభ్యర్థుల వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. పిటిషన్లలో తగిన బలం లేదని తేల్చింది. దీంతో డీఎస్సీ-2008 నియామకాల ప్రక్రియపై నెలకొన్న న్యాయపరమైన వివాదంలో కీలక స్పష్టత వచ్చినట్లయింది.






## సింగరేణి కార్మికులకు
# దసరా కానుక

**సగటున ఒక్కొక్కరికి రూ.1,53,912 బోనస్**

**కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున...**

**ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి**

02

## గంగా నదిలో పడవ బోల్తా..
# 13 మంది మృతి

**బిహార్ రాష్ట్రంలోని వైశాలి జిల్లా పరిధిలో ఘటన**



వైశాలి, అక్టోబర్ 13: బిహార్ రాష్ట్రంలోని వైశాలి జిల్లా పరిధిలోని గంగా నదిలో మంగళవారం రాత్రి పడవ బోల్తా పడింది. 15 నుంచి 20 మందితో విందు కార్యక్రమానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువగా చిన్నారులు

-మిగతా 2 లో..



## చెన్నైకి తాగునీరు
# ఇవ్వండి

**ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం**

**చెన్నై తాగునీటి అవసరాల కోసం అదనపు జలాలు కోరిన సీఎం విజయ్**

**గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు**

**నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ**

**ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి**




## సర్టిఫికెట్లకు సెక్యూరిటీ కవచం..లామినేషన్‌కు
# గుడ్‌బై భాయ్!

**మీసేవ పేపర్ కొత్త లుక్.. 15 సేఫ్టీ ఫీచర్లతో ఫేక్ సర్టిఫికెట్లకు చెక్!**

**హైదరాబాద్, అక్టోబర్ 13:**

తెలంగాణ సర్కారు ప్రజలకు మరో గుడ్‌న్యూస్ ఇచ్చిందీ భాయ్.. మీసేవలో ఇచ్చే సర్టిఫికెట్లు ఇక మరింత స్ట్రాంగ్‌గా, సేఫ్‌గా రానున్నయ్. మంత్రి శ్రీధర్‌బాబు ప్రజాభవన్‌లో కొత్త పేపర్ విధానాన్ని లాంఛనంగా స్టార్ట్ చేసిన్రు. ఇందులో 15 రకాల సెక్యూరిటీ ఫీచర్లు ఉండటంతో నీళ్లలో తడిసినా, ఈజీగా పాడైయ్యే చాన్స్ లేదట.. ఇక సర్టిఫికెట్లకు లామినేషన్ ఖర్చులు కూడా మిగులుతయ్. ప్రజలకు క్వాలిటీ సర్వీసులు అందించడంతో పాటు నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టడమే సర్కారు టార్గెట్ అంట..






## 2029 ఎన్నికల్లో మట్టికరుస్తారు

(మొదటిపేజీ తరువాయి)

అందుకే మీ పార్టీ తరచూ ఓడిపోతూనే ఉంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క చోట అయినా విజయకేతనం ఎగరేయలేక చతికిలపడింది"అని అన్నారు. ఓట్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, సీఈసీ జ్ఞానేశ్ వ్యతిరేక నిరసనలపై షా స్పందించారు. "తప్పుడు రాజకీయాలతో కాంగ్రెస్‌కు ఒనగూరేదేమీ ఉండదు. అయినా రాహుల్ పార్టీలో కీలక నేతగా ఎదిగాక, పార్టీ అధ్యక్షుడయ్యాక, దిగిపోయి తర్వాత విపక్షనేతగా ఎంపికయ్యాక సైతం పార్టీ ఎలాంటి ఘనతలు సాధించలేదు పైగా నిరాటంకంగా ఓడిపోతోంది. మరీ ముఖ్యంగా 2024లో ఎస్ఐఆర్ మొదలయ్యాక కాంగ్రెస్ ఓటముల జోరు ఎక్కువైంది. గతంలో గద్దెనెక్కి పరిపాలించిన గుజరాత్‌లో కాంగ్రెస్ గత 41 ఏళ్లుగా ఓటమిని చవిచూస్తోంది. ఈ లెక్కన ఇకనైనా రాహుల్ ఆత్మావలోకనం చేసుకుంటే మంచిది. కృత్రిమ మీడియా కార్యక్రమాలు, అబద్ధాలను రాజధాని నడివీధుల్లో వల్లెవేసినంత మాత్రాన మీరు ప్రజల విశ్వాసాన్ని పొందలేరు. చొరబాటుదారులను ఓటర్లుగా మార్చాలని రాహుల్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు"అని షా అన్నారు.




## నేడు బీఆర్ఎస్ 'సింగరేణి కార్మిక గర్జన'

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీశ్‌రెడ్డి, కౌశిక హరి, కోలేటి దామోదర్, మూల విజయారెడ్డి సభ విజయవంతం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. సభకు రామగుండం, మంథని నియోజకవర్గాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరానున్నారు. ' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పేరిట రెండేండ్లుగా సింగరేణి లాభాల్లోంచి పక్కన పెట్టిన రూ.రూ.6,324 కోట్లు ఏమైనయి? ఎక్కడ ఖర్చుపెట్టారో చెప్పాలి' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. మంగళవారం గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్మికుల జీతాలు, సంక్షేమం కోసం ప్రతి నెలా రూ.4 వేల కోట్లు ఓడీ రూపంలో తెస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం, ఇంత పెద్ద మొత్తంలో నిల్వ లు ఉన్నా మళ్లీ ఓడీలు ఎందుకు తేవాల్సి వస్తున్నదని నిలదీశారు. ఇది కార్మికులను మోసం చేసే పెద్ద స్కామ్ అని, దీనిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి కార్మిక గర్జన నిర్వహిస్తున్నందునే ప్రభుత్వం దిగివచ్చి కేటీఆర్ సభకు ముందే మంగళవారం లాభాల వాటాను ప్రకటించిందని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ సింగరేణి సంస్థను భ్రష్టుపట్టించిందని ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ విమర్శించారు. సోలార్ ప్లాంట్లు, డీజిల్, పెట్రోల్ కొనుగోళ్లు, ఓబీ వర్క్ టెండర్లు, ఎక్స్‌ప్లోజివ్‌ల కొనుగోళ్లలో విపరీతమైన కుంభకోణాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని చెప్పారు.



## నీటి పొదుపుపై 60 రోజులపాటు చైతన్య కార్యక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

నీటి లభ్యత ఉంది. కృష్ణా నది నుంచి 15 ఎంజీడీలు, మిషన్ భగీరథ ద్వారా 40, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి 5 ఎంజీడీల చొప్పున మొత్తం 60 ఎంజీడీల అదనపు నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. మల్లన్నసాగర్ పైప్‌లైన్ నిర్మాణం నవంబరులో పూర్తవుతుంది. దీంతో అదనంగా 20 ఎంజీడీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉంది" అని వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల ద్వారా నీరు సరఫరా అవుతున్న మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేయనున్నట్లు సీఎస్ తెలిపారు. తాగునీటిపై ప్రజల్లో అవగాహనకు సినీ నటులు, ప్రముఖులు, సెలబ్రిటీలను భాగస్వాములను చేయాలని సూచించారు. దానకిషోర్, అశోక్‌రెడ్డి, ఆర్.వి.కర్ణన్, వినయ్ కృష్ణారెడ్డి, సృజన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఐక్యంగా పోరాడతాం

(మొదటిపేజీ తరువాయి)

యోగేంద్ర యాదవ్ తదితరులు ఈ తేనీటి విందులో పాల్గొన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. జంతర్‌మంతర్‌ను డీనోటిఫై చేస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చట్టపరంగా సవాలు చేయబోతున్నామని రాహుల్ గాంధీ ప్రకటించారు. గంటన్నర పాటు జరిగిన విందు సమావేశం అనంతరం కూటమి నాయకులు ఉమ్మడిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుందని, చివరికి విజయం సాధిస్తుందని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. తమ ఉద్యమం వెనుక 'భారతదేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ'అనే ఏకైక లక్ష్యం ఉందన్నారు. దేశంలో నేడు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని, ఎన్నికల వ్యవస్థ ధ్వంసం చేశారని, రాజ్యాంగాన్ని చించి పారేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించడానికి తాము కలిసికట్టుగా పోరాడుతున్నామని వెల్లడించారు. ప్రజాస్వామ్య భావాలను వ్యక్తీకరించడానికి జంతర్ మంతర్ ఒక ప్రధాన వేదికగా ఉండేదన్నారు. అయితే, దానిని అందుకోసం ఉపయోగించకూడదని ప్రభుత్వం నిర్ణయించిందని ఆక్షేపించారు. ఈ నిర్ణయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. దేశంలో విధ్వంసానికి కారకులైన నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌తోపాటు చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, దాని నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని ఉద్ఘాటించారు. ఈ పోరాటం తమ కోసం కాదన్నారు. భారత ప్రజల కోసం, వారి భవిష్యత్తు కోసం



పోరాటం సాగుతోందన్నారు. ఓట్ల చోరీ వెనుక ఉన్నవారిలో 'ప్రస్తుతం డెహ్రాడూన్‌లో తలదాచుకుంటున్న ఒక మహిళ'కూడా ఉన్నారని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ఆమె పేరును వెల్లడించలేదు. న్యాయ వ్యవస్థ పట్ల తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. అందుకే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించామని స్పష్టంచేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను కోరుతూ చేపట్టాల్సిన కార్యాచరణను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై, అలాగే ప్రస్తుత పరిస్థితులపై చర్చించినట్లు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తామంతా ఏకమయ్యామని, ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. దేశ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ మాట్లాడుతూ... ప్రభుత్వం మొదట ఓట్ల దొంగతనానికి పాల్పడింది, ఇప్పుడు జంతర్ మంతర్‌ను కూడా లాగేసుకునే పనిలో ఉందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని సుప్రియా సూలే ఆందోళన వ్యక్తంచేశారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఐక్య పోరాటం కొనసాగుతుందన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో బీజేపీకి ఎలాంటి పాత్ర లేదని నేహా బోరా స్పష్టంచేశారు. ఆ పార్టీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం విషయంలో రాజీ పడిందని ఆరోపించారు. నిరసన తెలపడం రాజ్యాంగ హక్కు అని వివరించారు. ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతిపక్షం, పౌర సమాజం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయని ప్రశాంత్ భూషణ్ స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మొత్తం ఎన్నికల వ్యవస్థనే నేరమయం చేశారని, ఆయన ఒక మాఫియా అని రౌత్ ఆరోపించారు. శివసేన(ఉద్ధవ్) నాయకుడు సంజయ్ రౌత్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. మాఫియా శక్తులను ఎలా ఎదుర్కోవాలో, వారితో ఎలా వ్యవహరించాలో తెలుసన్నారు.

## రాష్ట్ర రోడ్లకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ఎలివేటెడ్ కారిడార్లు, కొత్త రహదారుల నిర్మాణాలపై చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి చేసిన కీలక ప్రతిపాదనలకు గడ్కరీ తక్షణ ఆమోదం తెలపడంతోపాటు మరికొన్నింటిపై సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ నగర ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర మంత్రి గడ్కరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతోపాటు ఎన్‌హెచ్--65 పరిధిలోని హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం రహదారి విస్తరణ పనులను మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపై సానుకూలత వ్యక్తం చేశారు. హైదరాబాద్--శ్రీశైలం (ఎన్‌హెచ్--765) మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలన్న విజ్ఞప్తిపై స్పందిస్తూ తక్షణమే కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్--167కె పరిధిలో కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ, ఏపీ మధ్య రవాణా వ్యవస్థ సులభతరం అవుతుంది. పర్యాటక రంగం గణనీయంగా అభివృద్ధి చెందనుంది. పర్వతమాల పథకం కింద తెలంగాణలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు ఉపయోగపడేలా 5 రోప్‌వేల నిర్మాణానికి గడ్కరీ ఆమోదముద్ర వేశారు. అలాగే కేంద్ర రోడ్డు మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) పరిధిలోని సేతు బంధన్ పథకం కింద 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జీల (ఆర్వోబీల) నిర్మాణానికి ఆమోదం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం



జిల్లాలో కొత్తగూడెం బైపాస్ రోడ్డుపై 4 లేన్ల ఆర్వోబీ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ వద్ద రైల్వే లెవల్ క్రాసింగ్ స్థానంలో 2 లేన్ల ఆర్వోబీ, నల్లగొండ జిల్లా దామరచర్ల-వీరలపాలెం రోడ్డుపై 4 లేన్ల ఆర్వోబీ సాకారం కానున్నాయి. తెలంగాణలో కీలక అంతర్గత మార్గమైన పుల్లూరు-అలంపూర్-జట్రపోలు-పెంట్లవెల్లి-కొల్లాపూర్-లింగాల-అచ్చంపేట-డిండి-దేవరకొండ-మల్లేపల్లి-నల్లగొండ రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలన్న మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల పరిధిలోని మరో 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులను త్వరగా విడుదల చేయాలని కోమటిరెడ్డి కోరగా వాటిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. కాగా, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్సీ) సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేయాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి ఆహ్వానించగా తప్పకుండా హాజరవుతానని ఆయన హామీ ఇచ్చారు.

## గంగా నదిలో పడవ బోల్తా.. 13 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు తెలుస్తోంది. వైశాలి జిల్లా ఉన్నతాధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పడవ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "పడవ బోల్తా పడిన ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు మోదీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ సైతం ఘటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు రూ.4 లక్షలు చొప్పున సాయం ప్రకటించారు.



## కాంగ్రెస్ రాజ్యాంగ వ్యవస్థలను బెదిరిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

ఔన్నత్యాన్ని కాపాడేందుకు న్యాయవాద లోకమంతా ఏకతాటిపైకి వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అపాయింట్‌మెంట్ అడిగి రాజకీయ వినతి పత్రాలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమో రాహుల్ గాంధీ జవాబివ్వాలి. కోర్టుల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను అప్రతిష్ఠపాలు చేసే సంస్కృతిని సమాజం ఎన్నటికీ హర్షించబోదు" అని అన్నారు.

## జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆందోళన

- గేటు దూకి లోపలికి ప్రవేశించి నిరసన వ్యక్తం చేసిన నేతలు
- జంతర్‌మంతర్ స్వాధీనం చేసుకున్నట్లు సీజేపీ ప్రకటన
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌ను నిరసనల వేదికల జాబితా నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించడంపై కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేతలు, కార్యకర్తలు మంగళవారం తెల్లవారుజామున ఆందోళనకు దిగారు. పార్టీ నేతలు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్, అజింక్య షిండే ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న కార్యకర్తలు పోలీసుల అడ్డంకులను దాటుకుని నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. ఇనుప గేటు, పోలీసుల బారికేడ్లను దూకి జంతర్‌మంతర్ ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేశారు. భారత్ మాతాకీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, జైభీమ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. 'సర్ఫరోష్ కీ తమన్నా'అనే విప్లవ కవితను కూడా పఠించారు. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండేతోపాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ నాయకులను ద్వారకా జిల్లాలోని జాఫర్‌పూర్ కలాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఓ అధికారి తెలిపారు. కొంతమంది సీజేపీ కార్యకర్తలు అక్కడ గుమిగూడటంతో పోలీస్ స్టేషన్ లోపల, చుట్టుపక్కల భద్రతను పెంచినట్లు చెప్పారు. జంతర్‌మంతర్ తాము తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు సీజేపీ ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. నిరసన తెలిపే హక్కు తమకు ఉందని వెల్లడించింది. తమ సభ్యులు బారికేడ్లను ఛేదించుకొని, జంతర్‌మంతర్ ప్రదేశంలోకి ప్రవేశించి, అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని వెల్లడించింది. జంతర్‌మంతర్ వద్ద తాము ప్రతిపాదించిన శాంతియుత నిరసన కోసం తేదీ, సమయం కోరుతూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు లేఖ సమర్పించిన రోజే.. అంటే అక్టోబర్ 12న ప్రభుత్వం నుంచి డీనోటిఫికేషన్ ప్రకటన వెలువడిందని అశుతోష్ రాంకా వెల్లడించారు. నిరసన తెలిపేందుకు అనుమతి కోసం అధికారులను సంప్రదించాలని ప్రభుత్వం చెప్పినట్లు గుర్తుచేశారు. అనుమతి కోరుతున్న సమయంలోనే నిబంధనలను మార్చడం ఏమిటని ప్రశ్నించారు. నిరసన ప్రదేశంలోకి ప్రవేశంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విధించిన ఆంక్షలను సౌరవ్ దాస్ తప్పుపట్టారు. ప్రజల సొత్తు అయిన జంతర్‌మంతర్‌ను లాక్కోవడానికి హోంశాఖకు అధికారం ఎక్కడదని నిలదీశారు. నిరసనలకు కేటాయించిన జంతర్‌మంతర్‌లో నిరసనలు కచ్చితంగా జరుగుతాయన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేదాకా అక్కడి నుంచే తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ.. రాజ్యాంగం మనతోనే ఉందని సౌరవ్ దాస్ అన్నారు. జంతర్‌మంతర్ వద్ద అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడారు. నిర్బంధంలో ఉన్న సీజేపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'దిశ'అనే విద్యార్థి సంఘం సభ్యులు మంగళవారం కన్నాట్ ప్లేస్ నుంచి జంతర్‌మంతర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జంతర్ మంతర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేయడాన్ని తప్పుపట్టారు. తమపార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేయడం పట్ల సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. 'ప్రజల ప్రతిఘటనను మీరు రద్దు చేయలేరు'అని తేల్చిచెప్పారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ మంగళవారం సోషల్ మీడియాలో దీప్కే పోస్టుచేశారు. జంతర్‌మంతర్‌లో జాతీయ జెండా ఎగరవేయడం కూడా నేరమేనా? అని ప్రశ్నించారు. నిరసన ప్రదేశం వైపు సీజేపీ సభ్యులు దూసుకెళ్లడం, ఒక గేటుపైకి ఎక్కి, త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని నినాదాలు చేయడం, ఆ తర్వాత పోలీసు సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్న ఒక వీడియోను దీప్కే షేర్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "నిర్ణీత నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగిస్తే, జవాబుదారీతనం కోరుతున్న ప్రజల గొంతు నొక్కేయవచ్చని ప్రభుత్వం భావిస్తే ఈ ఉద్యమం లక్ష్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నట్టే. జంతర్ మంతర్ కేవలం పటంలో ఒక ప్రదేశం మాత్రమే కాదు. అది అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడానికి పౌరులు గుమిగూడిన చోటు. ఏ పరిపాలనాపరమైన ఉత్తర్వు కూడా ఆ ప్రజాస్వామ్య స్ఫూర్తిని చెరిపివేయలేదు"అని దీప్కే ఉద్ఘాటించారు. సీజేపీ నాయకులు పోలీసుల నిర్బంధంలోనే ఉన్నారని, వారిని కలిసేందుకు తమ న్యాయవాదులకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. తమ నాయకులను కిడ్నాప్ చేశారని పోలీసులపై ధ్వజమెత్తారు. పోలీసులు చట్టాన్ని పాటించడం లేదని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చివరకు జంతర్ మంతర్ వద్దే జరుగుతుందని పేర్కొన్నారు. 'మీకు చేతనైంది చేసుకోండి'అంటూ ప్రభుత్వానికి సవాలు విసిరారు.

## సింగరేణి కార్మికులకు దసరా కానుక

- సగటున ఒక్కొక్కరికి రూ.1,53,912 బోనస్
- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున...
- ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి

**హైదరాబాద్:** సింగరేణి కార్మికులకు దసరా కానుక కింద రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే రూ.596 కోట్లను కార్మికులకు వారి వాటాగా పంపిణీ చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణరావు, విజయ రమణారావులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "మొత్తం 38,737 మంది శాశ్వత ఉద్యోగులకు సగటున రూ.1,53,912, మరో 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లిస్తాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, నైహా హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించాం. పెండింగ్‌లో ఉన్న సుమారు 300 డిపెండెంట్ ఆర్డర్లను 15 రోజుల్లో అర్హులకు అందజేస్తాం. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్పీ) చెల్లిస్తాం. కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో నాడు భారాస ప్రభుత్వం విఫలమైంది. సింగరేణి బొగ్గు ధరలు హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడింది. విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొత్తాలను క్రమంగా చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి భట్టి వివరించారు.

# అర్హుల చేతికి కొత్త రేషన్ కార్డులు.. లక్ష్మీపతిగూడెంలో పంపిణీ




**జిన్నారం, అక్టోబర్ 13,(స్పందన):**

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కీలకమైన నూతన రేషన్ కార్డులను గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు లక్ష్మీపతిగూడెంలో మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గద్దె గణేష్ పాల్గొని నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, జీపీఓ అంజయ్య, రేషన్ డీలర్ భాగారెడ్డి, గ్రామ పెద్దలు వి.వి. నర్సింలు, అంతయ్య, అశోక్, మురళి, పాషా, ఫెరోజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటితో జిన్నారం వీధుల్లో వెలుగుల జాతర!



**జిన్నారం, అక్టోబర్ 13,(స్పందన):**

మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో మెరుగైన వెలుతురు కల్పించడమే లక్ష్యంగా రూ.కోటి నిధులతో నూతన ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ నక్కిర్తి జనార్ధన్ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. నగర అభివృద్ధి పథకం కింద ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబర్ 93, తేదీ 23-01-2026 ద్వారా ఈ నిధులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. రాబోయే బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులు, కూడళ్లు, బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ దీపాల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వెలుతురు, సౌకర్యం, భద్రత కలుగుతాయని వెల్లడించారు. చైర్మన్ నక్కిర్తి జనార్ధన్, కమిషనర్ టి. నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సంబంధిత వార్డుల కౌన్సిలర్ల సమక్షంలో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది, స్థానిక నాయకులు రాజేందర్ రెడ్డి, ఎర్రవల్లి ప్రవీణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ సంబరాలు



**- గడ్డపోతారం మున్సిపల్ చైర్‌పర్సన్ గద్దె సుష్మా ఆధ్వర్యంలో వేడుకలు**

**గడ్డపోతారం, అక్టోబర్ 13,(స్పందన):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గద్దె సుష్మా, కమిషనర్ పి. తాన్య పాల్గొన్న ఈ వేడుకల్లో మహిళా కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకల్లో మహిళా ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొని సంబరాలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. రాష్ట్ర సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన బతుకమ్మ పండుగను ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందదాయకమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. సంప్రదాయ పండుగలను భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తూ, వాటి విశిష్టతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు మమత నవీన్, స్వప్న ,సంధ్య, మమత వెంకటేష్,వార్డు అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఏ

# అధికారుల నిర్లక్ష్యంతో నీటి వృధా.....

**ఝరాసంగం (స్పందన):**



ఝరాసంగం మండలం లోని చిలమామిడి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆదికారుల నిర్లక్ష్యంతో గ్రామంలో గల త్రాగునీటి నల్లాలకు నల్లాలు బిగించాక త్రాగునూరు వృధాగ పారుతున్నాయని గ్రామస్తులు అగ్రహ వ్యక్తం చేశారు. అసలే వర్షాకాలంలో వర్షాలు నామ మాత్రంగానే కురిసిన నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. చిల మామిడి గ్రామంలో నల్లాలు మర మ్మత్తులు చేపట్టి నీటి వృధాను అరికట్టాల్సిన అధికారులు ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నీటిని పొదుపుగ దృష్టిలో పెట్టుకొని ప్రజల్లో అవగాహన అవగాహన కల్పించవలసిన బాధ్యత అధికారులదే అన్నారు. మరమ్మత్తులు లేనియెడల గ్రామపంచాయతీముశీదు ధర్నా నిర్వహిస్తామన్నారు.

# కబ్జాపై చర్యలు.. ప్రహరీ గోడకే పరిమితమా?







**230 గజాల ఆక్రమణపై నోటీసులు.. కూల్చివేతలో మాత్రం పాక్షిక చర్యలే! ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సంతోష్‌రెడ్డి**

**సంగారెడ్డి,అక్టోబర్ 13(స్పందన)**



ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల చర్యలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూమి ఆక్రమణ వ్యవహారంలో ప్రహరీ గోడను కూల్చివేసిన అధికారులు, మిగిలిన నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 230 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నోటీసుల్లో పేర్కొన్నప్పటికీ, కూల్చివేత ప్రహరీ గోడకే పరిమితమైందని ఫిర్యాదుదారుడు సంతోష్‌రెడ్డి ఆరోపించారు.

**నోటీసుల్లో 230 గజాలు.. చర్యల్లో ప్రహరీ గోడేనా?**

ఈ వ్యవహారంపై సంతోష్‌రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఆర్డీవో తహశీల్దార్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగినట్లు తెలిపారు. దీనికి స్పందిస్తూ ప్రహరీ గోడ మాత్రమే కూల్చివేత పరిధిలోకి వస్తుందని తహశీల్దార్ చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే, సంబంధిత బిల్డర్‌కు జారీ చేసిన నోటీసులో 230 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. నోటీసుల్లో విస్తీర్ణాన్ని పేర్కొంటూ, ఉన్నతాధికారులకు మాత్రం ప్రహరీ గోడ గురించే వివరించడం ఏమిటని ప్రశ్నించారు.

**పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలి**

ప్రభుత్వ భూమి ఆక్రమణపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, తెలంగాణ భూ ఆక్రమణల నిరోధక చట్టం-1905లోని సెక్షన్ 7 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, ఆక్రమణకు గురైన స్థలంలో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూమి హద్దులను నిర్ధారించి, ఆక్రమణకు గురైన స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని సంతోష్‌రెడ్డి ఉన్నతాధికారులను కోరారు. మిగిలిన నిర్మాణాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు సంగారెడ్డిలో జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం

**సంగారెడ్డి, అక్టోబర్ 13(స్పందన)**

జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరీక్షల కోసం నేడు సంగారెడ్డిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ టీయూడబ్ల్యూజే,ఐజేయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సిద్ధిఖ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ తెలిపారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్, టీయూడబ్ల్యూజే,ఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, సన్ రైజ్ ఆసుపత్రి, రథసారథి తెలుగు దినపత్రిక సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగారెడ్డిలోని సన్రైజ్ ఆసుపత్రిలో శిబిరం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా



కలెక్టర్ ప్రతీక్ జైన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ. ఖాదర్ ఫైసల్ ముఖ్య అతిథిగా, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. శిబిరంలో సన్రైజ్ ఆసుపత్రికి చెందిన గుండె వైద్యులు, మధుమేహం, ఎముకలు, మెదడు, నాడీ సంబంధిత వ్యాధులు, చిన్నపిల్లలు, మహిళలకు, సాధారణ వైద్య విభాగాల నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందజేస్తారు. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అందుబాటులో ఉన్న మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, చిన్న, పెద్ద దినపత్రికలు, కేబుల్ మీడియా, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. జర్నలిస్టులు,
వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యేవారు సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# గుంటల భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

**ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడెకన్నే హన్మంతప్ప**

**నారాయణఖేడ్, అక్టోబర్ 13 (స్పందన):**



నారాయణఖేడ్ నియోజకవర్గంలో గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడెకన్నే హన్మంతప్ప తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నారాయణఖేడ్‌లోనే గుంటల భూముల రిజిస్ట్రేషన్లు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. గత 15 రోజులుగా నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్లు చేయడం లేదని పేర్కొన్నారు. భూభారతి ద్వారా స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వెళ్తున్న కొనుగోలుదారులను రిజిస్ట్రేషన్లు చేయకుండా వెనక్కి పంపిస్తున్నారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్లు చేయనప్పుడు స్లాట్ బుకింగ్ పేరుతో వేల రూపాయల చలానాలు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. పక్క నియోజకవర్గాల్లో లేని నిబంధనలు నారాయణఖేడ్‌లోనే ఎందుకు అమలు చేస్తున్నారో రెవెన్యూ అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఆరు నెలల్లో ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారని, ప్రభుత్వానికి చలానాలు చెల్లించినప్పటికీ నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి ఒత్తిడితో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారో అధికారులు వెల్లడించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఫాంల్యాండ్ల యజమానులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు, అవసరమైతే ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తామని హన్మంతప్ప స్పష్టం చేశారు.

# రైతుల విద్యుత్ సమస్యలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**- సోలక్‌పల్లిలో రైతులతో సమావేశం 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు**

**జిన్నారం,అక్టోబర్13,(స్పందన) :**





రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిన్నారం మండలం సోలక్‌పల్లి గ్రామంలో మంగళవారం పటాన్‌చెరు విద్యుత్ డివిజన్ అధికారి భాస్కరరావు, గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్ మంగళవారం బోరుబావుల వద్దకు వెళ్లి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యుత్ సరఫరా తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురవడం వల్ల వ్యవసాయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సోలక్‌పల్లి సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను యాసంగి పంటల సాగు సమయానికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని డివిజనల్ ఇంజినీరింగ్ అధికారి భాస్కరరావు రైతులకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని అధికారులు రైతులకు సూచించారు. రైతులు, వినియోగదారులతో విద్యుత్ సిబ్బంది మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ తుకారాం, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, మల్లేష్, రైతులు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆడపడుచులకు ఇబ్బందులు లేకుండా బతుకమ్మ ఘాట్

**- రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణానికి స్థల పరిశీలన**

**- గడ్డపోతారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్**

**జిన్నారం, అక్టోబర్ 13 (స్పందన):**



బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు సౌకర్యవంతంగా, సురక్షితంగా నిమజ్జనం చేసుకునేలా మాదారంలో బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారంలో సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఘాట్ నిర్మాణ స్థలాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలిసి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన.. బతుకమ్మ పండుగ నాటికి ఘాట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు మున్సిపల్ తరఫున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఘాట్ నిర్మాణం పూర్తయితే బతుకమ్మ నిమజ్జనం సమయంలో మహిళలకు ఇబ్బందులు తగ్గడంతోపాటు సురక్షితంగా పండుగ నిర్వహించుకునేందుకు వీలవుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేష్, నవీన్, స్వాతి, గణేష్ సింగ్, కో-ఆప్షన్ సభ్యురాలు రైసా ఖాతూం ఇబ్రహీం, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్, నాయకులు గణేష్, భగవాన్ సింగ్, శంకర్, రమేష్, నర్సింగ్ రావు, పాండు పాల్గొన్నారు.

## ఇప్పట్లో పెళ్లి చేసుకోను

బుల్లితెరపై హాస్య కార్యక్రమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న పలువురు నటీనటులు ఇప్పుడు వెండితెరపైనా అవకాశాలు అందుకుంటున్నారు. అలాంటి వారిలో జబర్దస్త్ ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన సత్య శ్రీ ఒకరు. తనదైన హాస్యంతో అలరించిన ఆమె.. ప్రస్తుతం సినిమాల్లోనూ వరుస అవకాశాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల నవీన్



పొలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' చిత్రంలో కథానాయిక స్నేహితురాలి పాత్రలో కనిపించి సందడి చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ప్రేమ, పెళ్లి, కుటుంబం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.స్కూల్ రోజుల్లో చాలామంది ప్రేమ ప్రతిపాదనలు తన పాఠశాల, కళాశాల రోజుల్లో చాలామంది తనకు ప్రేమ ప్రతిపాదనలు చేశారని సత్య శ్రీ తెలిపారు.



## చరణ్-సుకుమార్ సినిమాకు అనిరుధ్?

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఘన విజయాన్ని సాధించడంతో మరోసారి ఈ జోడీ కలిసి పనిచేయనుండటంపై అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. తాజాగా ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. క్రేజీ కాంబినేషన్‌పై ఆసక్తి

అనిరుధ్ తనదైన బాణీలు, నేపథ్య సంగీతంతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. భారీ చిత్రాలకు ఆయన అందిస్తున్న సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో రామ్‌చరణ్ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పుడు సుకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం కోసం ఆయన పేరు వినిపిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. గతంలోనూ వచ్చిన వార్తలు రామ్‌చరణ్, అనిరుధ్ కలిసి పనిచేసే అవకాశం గతంలోనే వచ్చినట్లు అప్పట్లో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. చరణ్ నటించిన 'బ్రూస్ లీ' చిత్రానికి తొలుత అనిరుధ్‌ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే చివరకు ఆ సినిమాకు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందించారు.



## కల్కి 2'లో సాయిపల్లవి?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ విజ్ఞాన కల్పిత చిత్రం 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా తెరకెక్కనున్న 'కల్కి 2'పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రముఖ నటి సాయిపల్లవి నటించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నెల 17 లేదా 18వ తేదీ నుంచి ఆమె చిత్రీకరణలో పాల్గొనే అవకాశముందని సమాచారం. దీపిక స్థానంలో సాయిపల్లవి? 'కల్కి 2898 ఏడీ' తొలి భాగంలో దీపికా పదుకొణె కీలక పాత్రలో కనిపించారు. అయితే, ఆమె స్థానంలో సాయిపల్లవిని తీసుకున్నట్లు తాజాగా వార్తలు వస్తున్నాయి. దీంతో సీక్వెల్‌లో సాయిపల్లవి ఎలాంటి పాత్రలో కనిపించనున్నారనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. అయితే ఆమె ఎంపిక, పాత్ర స్వరూపం, చిత్రీకరణలో పాల్గొనే తేదీలపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 'రామాయణ'తోనూ బిజీగా.. మరోవైపు సాయిపల్లవి ప్రస్తుతం 'రామాయణ' చిత్రంతోనూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇందులో ఆమె సీత పాత్రను పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకవైపు పౌరాణిక ఇతిహాసంలో సీతగా, మరోవైపు 'కల్కి 2'లో కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి ఈ చిత్రంలో భాగమైతే ఆమె పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చ మొదలైంది.



## ఒక్క సినిమాతో గుర్తింపు..

చిత్ర పరిశ్రమలో కొత్త కథానాయికల ప్రవేశం కొనసాగుతూనే ఉంది. ఇతర భాషల నుంచి వచ్చిన నటీమణులతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అమ్మాయిలు కూడా వెండితెరపై అవకాశాలు అందుకుంటున్నారు. అలా ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన పేరు ఆరాధ్య దేవి. తన అందం, ఛాయాచిత్రాలు, వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ భామ గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. అసలు పేరు శ్రీలక్ష్మీ సతీష్ ఆరాధ్య దేవి అసలు పేరు శ్రీలక్ష్మి సతీష్. సామాజిక మాధ్యమాల్లో చిన్నచిన్న వీడియోలు చేస్తూ ఆమె గుర్తింపు సంపాదించుకున్నారు. ఆమె వీడియోలను చూసిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన చిత్రంలో కథానాయికగా అవకాశం ఇచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆమె ప్రధాన పాత్రలో 'శారీ' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాతో ఆరాధ్య దేవి పేరు ప్రేక్షకుల్లోనూ చర్చకు వచ్చింది. సంప్రదాయ రూపం నుంచి గ్లామర్ పాత్రల వరకు సామాజిక మాధ్యమాల్లో చీరకట్టులో కనిపించిన ఆరాధ్య దేవి, సినిమాల్లో మాత్రం భిన్నమైన రూపంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.



## రోడ్డు విస్తరణకు బాలకృష్ణ స్థలం?

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ప్రభుత్వం, అధికారులు పలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముఖ్యంగా కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు ఎత్తైన రహదారి నిర్మాణంతో పాటు ప్రధాన కూడళ్ల విస్తరణపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు చెందిన నివాస స్థలంలో కొంత భాగాన్ని రోడ్డు విస్తరణ కోసం సేకరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రజా ప్రయోజనాల కోసం స్థలాన్ని ఇచ్చేందుకు బాలకృష్ణ సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఎన్టీఆర్ నిర్మించిన నివాసం బాలకృష్ణ నివాసానికి నందమూరి కుటుంబంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన తండ్రి, దివంగత నందమూరి తారక రామారావు 1982లో ఈ ఇంటిని నిర్మించారు. అప్పటి నుంచి ఈ నివాసం బాలకృష్ణ జీవితంలో ముఖ్యమైన భాగంగా నిలిచింది. అభిమానులను కలుసుకోవడంతో పాటు పలు రాజకీయ, సినీ సంబంధిత కార్యక్రమాలకు కూడా ఈ ఇల్లు వేదికగా నిలిచినట్లు చెబుతారు. దీంతో ఈ నివాసం నందమూరి కుటుంబానికి సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలతో ముడిపడిన ప్రదేశంగా గుర్తింపు పొందింది. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా విస్తరణబంజారాహిల్స్ నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు రోడ్డు నంబరు 45 కీలక మార్గంగా ఉంది. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780